
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024 | 5

ఇక మరింత సులభం

ఇసుక లభ్యత ఇక సులభతరం
పలు కార్యాలయాల్లో బుకింగ్ ఏర్పాట్లు
ఆపై స్టాక్ పాయింట్ల వద్దకు..
ధరలు నిర్ణయిస్తూ పోస్టర్లు

(● మండపేట)



పారదర్శకంగా..

ఇసుకను వినియోగదారులకు పారదర్శకంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సులభ పద్ధతిలో ఇసుకను సరఫరా చేసేలా మార్గదర్శకాలను రూపొందించింది. నెల రోజులు క్రితం జిల్లాలో ఇసుక సరఫరాకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి ఇసుక తక్కువ ధరకే అందనుంది. జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇసుక ర్యాంపులు ఉన్నాయి.

బుకింగ్ పాయింట్లు

మండల తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, జిల్లా గనులు భూగర్భ శాఖ మైనింగ్ కార్యాలయాలు వద్ద బుకింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇసుక కావాల్సిన వారు సమీపంలో ఉన్న సచివాలయం లేదా తహసీల్దార్, మైనింగ్ కార్యాలయాల్లో ఇసుక కోసం నమోదు చేసుకున్న వెంటనే రసీదులు ఇవ్వనున్నారు. వాటిని తీసుకుని స్టాక్ పాయింట్ వద్దకు వెళ్లి ఇసుకను తెచ్చుకోవాల్సి ఉంటుంది.

ఫిర్యాదులు ఇలా..

ఇసుకను అక్రమంగా తరలిస్తే జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేయనున్నారు. దానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఇసుక కమిటీ ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటుంది. మొత్తం మీద కూటమి ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ వల్ల వినియోగదారులకు పారదర్శకతతో కూడిన ఇసుక పంపిణీ అందుబాటులోకి రానుంది.

అక్రమాలకు పాల్పడితే బ్లాక్ లిస్టే..

ఇసుక రవాణా చేసే వాహనాల వివరాలు తప్పనిసరిగా రవాణాశాఖాధికారి వద్ద (ఆర్టీవో) వద్ద నమోదు చేసుకోవాలి. రవాణా చేసే ట్రాక్టర్ లేదా లారీ యజమానులు వివరాలను ప్రదర్శిస్తారు. ఇసుకను తరలించే వాహనాలకు యూనిక్ నెంబరుతోనే స్టాక్ పాయింట్ వద్దకు రావాల్సి ఉంటుంది. ఆ వాహనాలను మాత్రమే ఇసుక నిల్వ కేంద్రాల వద్దకు అనుమతిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తే ఆ వాహనాలను బ్లాక్ లిస్టులో పెడతారు.

చార్జీలు ఇలా..

రవాణా చార్జీలు, తవ్వకాలు, లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.168, సినరేజీ రాయల్టీ రూ.88, జీఎస్టీ రూ.70 కలుపుకుని టన్నుకు రూ.326 చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నుంచి 20 కిలోమీటర్ల లోపు ఉంటే ట్రాక్టర్‌కు 4.5 టన్నులకు గాను రూ.1400, 6 టైర్ల లారీ పది టన్నులకు గాను రూ.3600, పది టైర్ల లారీ 18 టన్నులకు గాను రూ.3840, 16 టైర్ల లారీ 18 టన్నులకు గాను రూ.4480గా ధరలను నిర్ణయించారు. 20 కిలోమీటర్ల దూరం పైబడితే వినియోగదారుడు అదనంగా రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక స్టాక్ పాయింట్‌లు వద్ద ధరలను తెలియజేస్తూ పోస్టర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇలా ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకత ఉంటుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అలాగే వినియోగదారుడికి కూడా ధరలు తెలిసే అవకాశం ఉంటుంది..



సచివాలయ ఉద్యోగుల బదిలీలపై
ఆదేశాలివే..

మండపేట, ఆగస్టు 25: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీపె ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. బదిలీలు కోరుకునే వారంతా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. అవసరమైన ధ్రువపత్రాలు అందజేయాల్సి ఉంటుంది. సంబంధిత శాఖల ఖాళీల ఆధారంగా బదిలీ ప్రక్రియ జరగనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు, 467 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి., గ్రామ పంచాయతీలకు సంబంధించి 385 మంది కార్యదర్శులు అవసరం కాగా కేవలం 174 మంది మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఇంకా సగానికి పైగా పంచాయతీ కార్యదర్శుల పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. వాటిలో ఇన్‌చార్జి కార్యదర్శులే విధులు నిర్వహిస్తున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే

బదిలీ కోరుకునే ఉద్యోగులు సంబంధిత వెబ్‌సైట్‌లో ముందు మెరిట్, సినియారిటీ ఇతర ప్రామాణికాలు పొందుపరచాలి. అపాయి ంట్‌మెంట్ అథారిటీ పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహిస్తాయి. ఈ ప్రక్రియ నెలాఖరులోగా చేపట్టాల్సి ఉంది. పరిపాలన అవసరాల నిమిత్తం ఉద్యోగులను బదిలీ చేసే అవకాశం ఉంది.

అనర్హులు దరఖాస్తు చేస్తే..

క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన ప్రక్రియ నడుస్తున్న వారు, ఏసీబీ, విజిలెన్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి దరఖాస్తులు తీసుకోరు. ఉద్యోగులు సొంత ప్రాంతాల్లో పనిచేయటానికి వీలులేదు. ఇలా ఎవరైనా అర్హం కాని దరఖాస్తు చేసుకుంటే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే వీలుంది. ఈ బదిలీ ప్రక్రియ ఈనెలాఖరుకల్లా పూర్తి చేసి నెలాఖరులోగా బదిలీ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది..



● (అమలాపురం రూరల్)

మీ గ్రామంలోనే పిల్లలు చదువుకున్న పాఠశాలలోనే జూనియర్ కళాశాలలన్నారు. ఫీజులు చెల్లించనవసరం లేకుండా దూరాభారం లేని ఇంటర్ విద్యను అందిస్తామన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని గొప్పలు చెప్పారు. కానీ గత వైసీపీ పాలనలో ఎంపిక చేయబడ్డ ఉన్నత పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. కానీ విద్యార్థుల ఉన్నతిని పట్టించుకోవడం విస్మరించారు. ఆయా జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులను నియమించలేదు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఉన్నత పాఠశాలల్లోని తరగతి గదుల్లోనే విద్యాభ్యాసం. అరకొరగా ఉన్న సైన్స్ లేబొరేటరీలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి. దీంతో ఆయా కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పడిపోయింది.

ఉన్నతంగా లేవు

లక్ష్యానికి దూరంగా ప్లస్-2 కళాశాలలు
ప్రభుత్వ పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలలు
తరగతి గదులు.. అధ్యాపకుల కొరత
మౌలిక సదుపాయాలు దారుణం
కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల ఆశలు

21 పాఠశాలల్లో కళాశాలలు

2022-23 విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల్లోనే ఇంటర్ విద్యను ప్లస్-2 పేరిట అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లాలోని 21 పాఠశాలల్లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని, ఒక్కో గ్రూపులోను గరిష్ఠంగా 40 మంది విద్యార్థినులను చేర్చుకోవాల్సి ఉంది. చేరిన విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన స్కూల్ అసిస్టెంట్లచే పాఠ్యాంశాలు బోధించాలని ఆదేశించారు. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను విలీనం చేయడం, దానికితోడు ఇంటర్ విద్యను అందించేలా జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయడంతో తరగతి గదుల సమస్య ఉత్పన్నమైంది. అంతే కాకుండా అధ్యాపకుల కొరత వేధిస్తుంది. ఇదిలా ఉండగా కోఎడ్యుకేషన్ కోసం జిల్లాలో పది ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు.



జిల్లాలో 21 బాలికల జూనియర్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం 303 మంది, రెండో సంవత్సరం 272 మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యాభ్యాసం సాగిస్తున్నారు. కోఎడ్యుకేషన్‌లో మొదటి సంవత్సరం బాలురు 73 మంది, బాలికలు 94 మందితో కలిపి 167 మంది 10 జూనియర్ కళాశాలల్లో చేరారు.



కళాశాలల్లో సౌకర్యాలు నిల్..

బోర్డులు తగిలించేశారు. కనీస సౌకర్యాలు లేవు, అధ్యాపకులు లేరు. అయినప్పటికీ ఆయా పాఠశాలల వద్ద జూనియర్ కళాశాలల బోర్డులు ఏర్పాటు చేశారు. ఇంటర్ కళాశాలలు వచ్చాయి. మీ పిల్లలను చేర్పించండి అంటూ అప్పటి జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులను చేర్పించి అడ్డంగా ముంచేసింది. స్కూల్ అసిస్టెంట్లే ఇంటర్ విద్యను బోధిస్తుండడంతో ఉత్తీర్ణతా శాతం కూడా పడిపోయింది. బాలికల జూనియర్ కళాశాలల్లో అత్యధికంగా అల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్-2 కళాశాలలో 29 మంది విద్యార్థినులు చేరగా అత్యల్పంగా రాయవరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఇద్దరు విద్యార్థినులు ఉన్నారు. కోఎడ్యుకేషన్‌లో అత్యధికంగా సఖినేటిపల్లి మండలం రామేశ్వరం జడ్పీహెచ్‌ఎస్ కళాశాలలో 30 మంది విద్యార్థులు ఉండగా, అత్యల్పంగా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి జూనియర్ కళాశాలలో ముగ్గురే విద్యార్థుల ఉన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 31 జూనియర్ కళాశాలల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



చెక్ అందిస్తున్న జేసీ నిషాంతి

మహిళల ఆర్థికాభివృద్ధే
లక్ష్యం

జిల్లాలో ఏడాదికి 67,867 మందిని లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలి
జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్వావలంబన సాధించేలా చేసి ప్రతీ మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. మహారాష్ట్రలోని జల్గావ్‌లో లఖ్‌పతి దీదీలను ప్రధాని నరేంద్ర మోదీ సన్మానించే కార్యక్రమంలో పాల్గొనగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు వీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వరుసగా నాలుగు వ్యవసాయ సీజన్లలో వార్షిక ఆదాయం రూ.లక్ష కంటే ఎక్కువ కలిగిన స్వయం సహాయక సంఘ మహిళలను లఖ్‌పతి దీదీలుగా పరిగణిస్తారన్నారు. జిల్లాలో వంద రోజుల్లో 4072 మంది, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 67,867 మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తక్కువ వడ్డీతో రూ.5 లక్షల రుణాలు అందించేందుకు ప్రత్యేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద సబ్సిడీ రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళల నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా శిక్షణలు ఇస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆదాయం పెంచడానికి ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. జిల్లాలోని 507 స్వయం సహాయక సంఘాల్లోని లఖ్‌పతి దీదీలకు రూ.50 కోట్ల బ్యాంకు రుణాల మెగా చెక్కును జేసీ నిషాంతి అందజేశారు. ఆలమూరు, మండపేట మండలాల మహిళా సమాఖ్యలకు కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద రూ.20 లక్షల చెక్కును అందించారు. అనంతరం స్వయం సహాయక సంఘ మహిళలు తయారుచేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివ శంకరప్రసాద్, ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వంశీకృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ, బీజేపీ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల దొరబాబు, మోకా వెంకటసుబ్బారావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, కేవీఎల్ అన్నపూర్ణ, ఏపీఎం రమణ పాల్గొన్నారు.

కృష్ణా..ముకుందా..

జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి సందడి మొదలయ్యింది. ఒకరోజు ముందుగానే ఆదివారం పలు ప్రాంతాల్లో చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టి సందడి చేశారు.. కొన్ని పాఠశాలల్లో నిర్వాహకులు ప్రత్యేకంగా విద్యార్థులను పిలిపించి సంబరాలు చేశారు. మరోవైపు సోమవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు..

వార్తలు..8లో





మామిడికుదురులో సందడి

మండపేటలో కారు మబ్బుల మధ్య పచ్చని పైరు

● మండపేట




ప్రకృతి చెక్కిన చిత్రాలు

కూనవరం మొగ వద్ద సముద్రతీరాన ఇసుక తిన్నెలపై కనువిందు చేస్తున్న ఈ సైకత చిత్రాలను చూడండి. వీటిని ఏ సైకత శిల్పి చెక్కలేదు..సహజసిద్ధంగా ఏర్పడినవి.. ఈ చిత్రాల అందాన్ని క్లోజప్‌లో చూడాలనే ఆశతో చాలా మంది వచ్చి ఫోటోలు తీశారు..

● ఉప్పలగుప్తం



కూనవరం మొగ వద్ద ప్రత్యేక ఆకృతి



కర్బలా పుణ్యభూమిలో అశువులు బాసిన ఇమామ్ హుస్సేన్ అతని 72 మంది పరివారానికి నివాళులర్పించే కార్యక్రమంలో భాగంగా నగరంలోని బీబీ సకీనా పంజాలో, మామిడికుదురులోని ఇమామ్ రజా పంజాలోను మజ్లిస్‌లు జరిగాయి.

● మామిడికుదురు

8లో



ఒంటెలపై హమారీల ఊరేగింపు

గంజాయిపై కూటమి యుద్ధమే



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

2019కి ముందు టీడీపీ ప్రభుత్వం గంజాయిపై యుద్ధమే చేసింది. సాగును నిర్మూలించడమే కాకుండా గిరిజన యువత అటువైపు మళ్లకుండా ప్రత్యామ్నా య ఉపాధి చూపింది. నిరంతర నిఘాతో స్మగ్లర్ల ఆట కట్టించింది. అయితే 2019లో వైసీపీ అధికార పగ్గాలు చేపట్టడంతో మళ్లీ గంజాయి మొక్కలు ఏపుగా పెరిగాయి. గత ఐదేళ్లలో గంజాయి సాగు, రవాణా, వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. గంజాయి పొగ పల్లెల వరకూ పాకేసింది. యువత జీవితాల నూ నాశనం చేస్తోంది. వైసీపీ పాలకుల అండతో తూర్పు అరణ్యం గంజాయి హబ్‌గా మారిపోయింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గంజాయిపై మళ్లీ పోరు ప్రకటించింది. గంజాయిని ఎట్టి పరిస్థితు ల్లోనూ అరికడతామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్ప టికే చెప్పారు. గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని హోంమంత్రి అనిత గట్టిగానే హెచ్చరించారు. మరో మంత్రి సుభాష్ కూడా సమాచారం ఇస్తే రూ.5 వేలు బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పుడు కూటమి ముందున్న పెను సవాళ్లలో గంజాయి నిర్మూలన అధిక ప్రాధాన్యం కలిగిన అంశం. ఈ నేపథ్యంలో యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్‌కి అవసరమైన సంపత్తిని సమ కూర్చి, సమర్థవంతమైన అధికారిని అధిపతిగా నియమించి రంగంలోకి దిగడా నికి కూటమి పాలకులు సిద్ధం కావడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

● గంజాయి రవాణాలో జిల్లా కీలకం

జిల్లా గుండా హైవే వెళుతుండడంతో రవాణాలో జిల్లా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతూనే ఉంది. గత నెలలో సెబ్ పోలీసులు కాకినాడ నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్న 350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 3న బొమ్మూరు పోలీసులు తమిళ నాడుకు తీసుకెళుతున్న 440కిలోల గంజాయిని పట్టుకున్నారు. దీని రవాణాకు వ్యానుకు ప్రత్యేక అర ఏర్పాటుచేయడం చూసి ఆశ్చర్యపోయారు. శనివారం ఒక్కరోజే జిల్లాలో మూడు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో గంజాయిపై 2019 నుంచి ఈ ఏడాది జూలై చివరివరకూ 288 కేసులు నమోదయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.124 కోట్ల విలువ చేసే 26 వేల కిలోల గంజాయి పట్టుబడింది. 219 రౌడీషీట్లు ఓపెన్ చేయగా, ఆరుగురిపై పీడీ యాక్టు కింద కేసులు పెట్టారు. 201 వాహనాలను స్వాధీనం చేసుకు న్నారు. 590 మంది సరఫరాదారులను గుర్తించి 460మందిని, 401 మంది అమ్మకందారులకు 350 మందిని అరెస్టు చేశారు. వీరిలో 120 మంది వరకూ ఇతర రాష్ట్రాల వాళ్లు ఉన్నారు.

గత ఐదేళ్లగా సాగు చేసుకున్నోడికి సాగు చేసుకున్నంత అనే చందంగా పరిస్థితి మారిపోయింది. అక్రమాలతో అంటకాగిన వైసీపీ పాలకులు తమకు అనుకూలమైన అధికారులను ఆయా పోలీస్‌స్టేషన్లకు రప్పించుకున్నారు. దీంతో గంజాయిసాగు, రవాణా మరింత సులభం అయిపోయింది. తూర్పు మన్యం లోని దట్టమైన అటవీ ప్రాంతంలో సాగు జరుగుతూ ఉంటుంది. ఏవోబీలోనే అని అధి కారులు చెబుతున్నా..మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలను అనుకొని ఉన్న విశాఖ మన్యంలో గంజాయిని విస్తృతంగా పండిస్తున్నారు. అక్కడి నుంచి ఘాట్ రోడ్డులో నర్సీపట్నం వైపు వెళితే చెక్ పోస్టులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి తదితర మార్గాల్లో గంజాయి రవాణా పాయింట్లకు చేరుతుంది. దీనికి అడ్డుకట్ట పడాలంటే ఏజెన్సీ ప్రాంతంలో పోలీసు, ఫారెస్టు అధికారులు, సిబ్బం ది ప్రక్షాళన సమూలంగా జరగాల్సిందే. కూటమి ప్రభు త్వం ఇంకా దృష్టి సారించకపోవడంతో గంజాయి దందా యథావిధిగా కొన'సాగు'తోంది.

● పోలీసుల ప్రక్షాళనతోనే

ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరం సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇలా గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతు న్నాయి. బహిరంగ మార్కెట్‌లోకి వచ్చేసరికి యువత జీవితాలు నాశనమవు తున్నాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో రిమాండు/ శిక్షపడిన ఖైదీలు సుమారు 600 మంది వరకూ ఉన్నారు. గిరిజనుల కోసం ఉన్న కమిషన్లు, వ్యవస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం గంజాయిపై దృష్టి పెట్టింది. యుద్ధం ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేస్తోంది.

- 'ఆకే' అధిపతిగా ఏఎన్‌టీఎఫ్ రంగంలోకి
- ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక టీం ఏర్పాటు
- మత్తులో యువత జీవితాలు చిత్తు
- పల్లెల్లోనూ గప్పు గుప్పు
- గిరిజన యువతకు ఉపాధి కొరత..
- గంజాయి సాగు.. సరఫరా బాట
- టీడీపీ హయాంలో ప్రత్యామ్నాయంపై చొరవ
- వైసీపీ ప్రభుత్వంలో గంజాయి హబ్
- జైళ్లలో మగ్గుతున్న గిరిజనులు
- ఏజెన్సీలో పోలీసుల ప్రక్షాళనతో అడ్డుకట్ట





ఇటీవల మోతుగూడెం చెక్‌పోస్టువద్ద అంబులెన్స్‌లో గంజాయి రావాణాచేస్తూ దొరికిపోయిన నిందితులు

కూటమి యుద్ధం ఇలా

గంజాయిపై యుద్ధానికి కూటమి ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీని సిఫార్సులతో గంజాయి, డ్రగ్స్ కట్టడికి యాంటీ నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) అవసరమైన సిబ్బంది, సంపత్తితో రంగంలోకి దిగబో తోంది. మత్తు పదార్థాల నిల్వ, స్మగ్లింగ్, విక్రయాలతో పాటు గంజాయి సాగు, సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తమ నిఘా విభాగంతో పాటు పోలీస్, ఎక్సైజు, రెవెన్యూ విభాగాల సహకారంతో సేకరి స్తోంది. టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటుచేసి ఖచ్చితమైన సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతి అందజేస్తారు. యాంటీ డ్రగ్ స్క్వాడ్ బృందాలతో గంజాయి సాగును ధ్వంసం చేస్తారు. గంజాయి సాగుతో సంబంధం ఉన్న జిల్లాల సరిహద్దుల్లో పటిష్ట నిఘాతో చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తారు. ఫేషియల్ రికగ్నిజేషన్, ఆటో మేటిక్ నంబరు గుర్తింపు వంటి అధునాతన వ్యవస్థలతో కూడిన సీసీ కెమెరా లను అమర్చుతారు. ఈయుద్ధం కోసం కూటమి ప్రభుత్వం అస్త్రశస్త్రాలతో రంగంలోకి దిగుతోంది. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను ఏఎన్‌టీఎఫ్ అధిపతిగా నియమించింది. ఇద్దరు ఎస్పీలు, నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు ఉంటారు. ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే ఏఎన్‌టీఎఫ్ సెల్‌లో 26 మంది ఎస్‌ఐలతో టీం ఉంటుంది. రెగ్యులర్ ఎస్పీ మొత్తం ఆపరేషన్‌ని పర్యవేక్షిస్తుంటారు. గంజాయి సాగు, సరఫరా, అమ్మకం, వాడకం వంటివి ఇకపై గంజాయి కేసులు అమరావతిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసే ఏఎన్‌టీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేస్తారు. ఈ స్టేషన్లలో డీఎస్పీ ర్యాంకు అధికారితో సహా కిందిస్థాయి సిబ్బంది వరకూ 82 మంది ఉంటారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఏఎన్‌టీఎఫ్ సెల్‌లో పనిచేయడానికి సీఐలు, ఎస్‌ఐలు, ఇతర యూనిఫాం సిబ్బందిని 461 మందిని నియమించు కోవడానికి ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చింది.

● ఐదు నెలల్లో లక్షల ఆదాయం

ఎకరా సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.10లక్షల వరకూ రకం, డిమాండును బట్టి ఆదాయం వస్తోంది. దీంతో సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి అధునాతన సాంకేతికతతో గంజాయి పండిస్తున్నారు. నీటి కొరత రాకుండా కొండ వాగులకు దగ్గరలో సాగు జరుగుతోంది. స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు వినియోగిస్తున్నారు. చీడపీడలకు, బలానికి మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరాకు 500 వరకూ పాదులు పెట్టి ఒక్కో పాదులో 20 వరకూ మొక్కలు నాటతారు. వారంలో మొలకెత్తి నెలలో మొక్క దశకు, ఐదు నెలల్లో పంట చేతికి వచ్చేస్తుంది. తర్వాత గంజాయి ఆకును కోసి ఆరబెడతారు. ఇళ్లలో నాణ్యత, రకం చూపించడానికి కొద్ది మొత్తంలో ఉంచి రహస్య ప్రాంతాల్లో పెద్ద మొత్తాల్లో దాస్తుంటారు. ఆయా ప్రాంతాలకు ఎవరైనా వెళితే ముందుగా ఇంటి వద్ద ఉన్న గంజాయిని మచ్చుకు చూపెడతారు. దీంతో ఏజెన్సీతో పాటు గొర్రెకొండ, నర్సీపట్నం, ప్రత్తిపాడు, తుని తదితర ప్రాంతాలకు చెందిన గిరిజ నేతరులు కూడా ఈ సాగువైపు మొగ్గుతున్నారు. సులభంగా రవాణా చేయడానికి లిక్విడ్, పొడుల రూపంలో కూడా స్థానికంగానే యంత్రాల సహాయంతో తయారు చేసే స్థాయికి గంజాయి సాగు చేరింది.

ఇదిగో 'సాగు'తుంది ఇలా

గత ఐదేళ్లలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్టు, పాడేరు, అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తదితర మండలాల్లో.. ముఖ్యంగా విశాఖను ఆనుకొని ఉన్న జిల్లాల్లో కూడా దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ మారుమూల గ్రామాల్లో 25 వేల ఎకరాలకు సాగు విస్తరించింది. మన్యంలో రూ.2వేల కోట్ల వరకూ ఏడా దికి వ్యాపారం జరుగుతుందని అంచనా. స్థానికంగా గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. పాడేరు, చింతపల్లిలో రూ.5 వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుకుతుంది. కొనుగోలు దారులు చెప్పిన ప్రాంతానికి చేరిస్తే దూరాన్ని బట్టి ధర ఉంటుంది. దళారులు ఆ బాధ్యతను నిర్వర్తిస్తారు. చింతపల్లి, నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం ద్వారా ఎర్రవరం దగ్గర హైవేకు.. సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం, రాజమహేంద్రవరం.. చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, భద్రాచలం గుండా తెలంగాణకు రవాణా చేస్తున్నారు. ఏడాది పొడవునా సరఫరా జరుగు తోంది. సామర్లకోట, రాజమండ్రి రైల్వేస్టేషన్ల ద్వారా కూడా గంజాయిని తీసుకె ళ్తున్నారు. తమిళనాడులోని సేలం, ఈరోడ్, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, హైదరా బాద్‌కు ఎక్కువగా వెళుతోంది. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, కర్నాటక, ఒరిసా వంటి సుదూర ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.20 వేలు ముడుతుంది.

గంజాయి నిర్మూలను ఉన్నతాధికారులు ఆప సోపాలు పడుతుంటే స్థానిక సిబ్బంది మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. ఏజె న్సీ మండలాల్లో బేస్ క్యాంపులు ఉంటాయి. పోలీసుల చెక్ పోస్టులు.. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఫారెస్ట్ చెక్ పోస్టులు మండలానికి సుమారు 15వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మ ంగి, చింతూరు, జడ్డంగి తదితర పోలీస్‌స్టేషన్లు రోడ్డుపక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపు లు వాటికి కనిపించవు.

● మామ్మూళ్ల మైకం మామూలే

గంజాయి సాగు, రవాణా వంటి విషయాలు పోలీసు, ఫారెస్టు వాళ్లకు తెలియని తంతు కాదనే వాదనా ఉంది. గంజాయి రవాణాకు సహరిస్తున్న మోతుగూడెం ఎస్‌ఐ, కాని స్టేబుల్ గతంలో అరెస్టయ్యారు. పోలీసులు చూసీచూడకుండా వదిలేయ డానికి 'ఒప్పందాలు' ఉంటాయని స్థానికులు చెబుతుంటారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గ్రామాలు కావడంతో నక్సల్స్ ప్రభావం ఉంటుంది. శాటిలైట్ ఇమేజ్‌లుద్వారా సాగు జరగడంలేదని తెలు స్తోందని పోలీసుల ఉన్నతాధికారులు చెబుతున్నా గంజాయి సాగుకు కలిసొస్తుంది. మైదాన ప్రాంతాలకు తరలి పోతున్న వేల కిలోల గంజాయి ఆ మాటలను వెక్కిరిస్తోంది.





దగ్గుపాటి పురందేశ్వరిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, గుణ్ణం చంద్రమౌళిని సత్కరిస్తున్న బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

నిరుపేదల అభివృద్ధికి చేయూత అందించాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సర్పవరంజంక్షన్, ఆగస్టు 25: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. రాజకీయ కక్షతో విద్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, రంగాలపై పగబట్టి మూసివేయించారు. కమ్మ కులంలో పుట్టడమే నేరంగా దాడులు చేయించి పక్క రాష్ట్రాలకు పారిపోయేలా గత పాలకులు చేశారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు దేశంలో, ఇతర దేశాల్లో ఎక్కడెక్కడ ఉన్నవారంత కలసి వచ్చి సంఘటితంగా తగిన బుద్ధి చెప్పారు. కమ్మ సామాజిక వర్గం వారంతా సంఘటితంగా ఉంటూ హక్కులు సాధించు కుంటూ మనలో ఉన్న నిరుపేదల అభివృద్ధికి చేయూత అందించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యు రాలు దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. ఆదివారం ఆర్టీవో ఆఫీసు రోడ్డులో గల కాకినాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు చుండ్రు గోవిందరాజు అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందే శ్వరి, టీడీపీకి చెందిన రాజమహేంద్రవరం రూరల్, మండపేట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావులకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్మ కులం దాతృత్వం గురించి తెలియని వారుండరన్నారు. ఎన్టీఆర్ కమ్మసామాజిక వర్గానికి చెందిన వ్యక్తే అయినా ఒక్క కులానికే కాక యావత్తు ప్రపంచానికి తెలుగువారి ఖ్యాతి తెలిపిన మహోన్నతి వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్ అన్నారు. కులం మనకు బలం కావాలే తప్పా, ఇతర కులాలకు భారం కాకూడదని ఆదర్శంగా నిలవాని కోరారు. మంచి ప్రభుత్వాన్ని, ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సుపరిపాలన అందించే గొప్ప ఆలోచనతో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసిన వారందరికీ జరి గిన సన్మానమే ఈ అరుదైన సత్కారంగా భావిస్తున్నట్లు చెప్పారు. వ్యవస్థలను నాసనం చేసి, నియంతృత్వ పాలనతో రాష్ట్రాన్ని సొంత జాగీరులా చేసిన జగన్ పై అనేక పోరాటాలు చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఆడపిల్లల సంఖ్య తగ్గడం మంచిది కాదని యువత సంఖ్య పెంపు కోసం ఆలోచన చేయాలని కోరారు. జగన్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలని, కమ్మవాళ్లను తొక్కేయాలని చేయని ప్రయత్నంలేదని, దాంతో ఎక్కడెక్కడ ఉంటున్న వారంతా వచ్చి సంఘటితమై ఇతర కులాలతో కలసి జగన్‌పాలనకు చరమగీతం పాడార ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి చేతుల మీదుగా గుణ్ణం చంద్రమౌళి, బొడ్డు వెంకటరమణ చౌదరి, మేకా లక్ష్మణ రావు, నెక్కంటి సుబ్బారాయుడు, యార్లగడ్డ వీర్రాజు తదితరులను సత్కరిం చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అనంతబాబు అక్రమాల్లో అధికారులూ పాత్రధారులే

● ఏబీఎన్ లైవ్‌లో ఐపీఎస్, ఐఏఎస్‌లపై ఆరోపణలు చేసిన రంప ఎమ్మెల్యే శిరీష

అమరావతి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 25: అల్లూరి జిల్లా రంపచోడవరం ఎమ్మెల్సీ అనంతబాబు అక్రమాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులూ పాత్రధా రులేనంటూ, గత పదేళ్లలో అనంతబాబు చేసిన అక్రమాలపై రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష ఆరోపించారు. ఆదివారం ఏబీఎన్ లైవ్‌లో పాల్గొన్న ఆమె అనంతబాబు బూతు వీడియో దగ్గర నుంచి ఆయన పాల్పడ్డ అక్రమాల వరకూ చిట్టా విప్పారు. రంపచోడవరం మన్యాన్ని అడ్డాగా చేసుకొని అన్ని వనరులనూ ఆదాయంగా మార్చుకున్నారని, ఇందులో జగన్ ప్రభుత్వ పెద్దల తో పాటు, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖల్లోని ఉన్నతాధికారులు కూడా పాలు పంచుకున్నారన్నారు. ముఖ్యంగా ఆయన అక్రమాల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధి కారులు కూడా భాగస్వామ్యులు కావడం బాధాకరమని పేర్కొన్నారు. గత పదేళ్లగా అనంతబాబు ఇక్కడ అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుని, నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారని, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అయితే ఆయ నకు అడ్డే లేకుండాపోయిందన్నారు. మొత్తం గత ఐదేళ్లలో జరిగిన భాగోతాల న్నింటిపైనా విచారణ జరిపించాలని ఆమె కోరారు. రంపచోడవరం ఏఎస్పీ తీరుపై కూడా శిరీష ఆరోపణలు చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు బూతువీ డియో కలకలం అయ్యాక, దానిని మార్ఫింగ్ వీడియోగా చెప్పుకుని తనను ఎవరో బ్లాక్‌మెయిల్ చేసి తన వద్ద లక్షలాది రూపాయలు గుంజేశారని, వారి పై చర్యలు తీసుకోవాలని తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని అనంతబాబు కథలు అల్లారన్నారు. నిజానికి ఆరునెలల నుంచి ఒక ఎమ్మెల్సీని ఎవరో బ్లాక్ మెయిల్ చేస్తే, లక్షలాది రూపాయలను గుంజేస్తే వారి ప్రభుత్వంలో ఎటు వంటి చర్యలూ తీసుకోకుండా ఉంటారా అంటూ ఆమె ప్రశ్నించారు. నిజానికి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అంది ఉండదని, అయితే రంపచోడవరం ఏఎస్పీ మాత్రం తనకు వాట్సాప్‌లో ఫిర్యాదు అందిందని చెప్పడాన్ని ఆమె త ప్పుబట్టారు. ఇదిలావుండగా వీధి సుబ్రమణ్యం కేసులో అనంతబాబుతో పాటు ఆయన 12 మంది బృందం పాల్గొంటే కేవలం అనంతబాబు మాత్రం నేరం తనపై వేసుకుని తన బృందాన్ని కాపాడుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. మన్యంలో చోటు చేసుకున్న అక్రమాలన్నిటిపైనా, అనంతబాబు వైఖరిపైనా వ చ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఖచ్చితంగా చర్చించి తగు విచారణతోపాటు బాధ్యు లందరిపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరతానని ఆమె చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

తాళ్లరేవు, ఆగస్టు 25: ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు యానాం వెళు తుండగా దారిమధ్యలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో యువ కుడు మృతి చెందాడు. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన మల్లాడి గంగాధరవర్మ (27) యానాంలో ఏటీఎంలో డబ్బులు తీసుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు వద్ద 216 జాతీయరహారిపై యానాం నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో తరలించారు. ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

1 నుంచి శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు

● వారం రోజులు ప్రత్యేక పూజలు



పిఠాపురం, ఆగస్టు 25: దేశవ్యాప ్తంగా శ్రీపాదుని జన్మస్థానంగా విరాజి ల్లుతున్న పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకూ శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు జరుగనున్నాయి. వారం రోజులపాటు ప్రత్యేక పూజలు, కా ర్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌తోపాటు ఉత్తరాది, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు అధికంగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, తీర్థప్రసాద వినియోగం, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానం, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీ గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర పారాయణ జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్టాపన, దత్త మంత్ర హోమం, సాయంత్రం 5గంటలకు శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాదపద్మ ములకు వివిధహారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన, మ ంగళహారతి నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

పుష్పపూజలు

1వ తేదీన ఆదివారం శ్రీపాదశ్రీవల్లభులకు సర్వపుష్ప పూజ, 2న లక్ష బిల్వార్చన, 3న సహస్ర చామంతి పూజ, 4న సహస్ర లిలీ పుష్పపూజ, 5న లక్ష తులసి అర్చన, 6న సహస్ర గులాబి అర్చన, 7న శ్రీపాద జయంతి రోజున పూలంగి సేవ, మారేడుపత్రి పూజ, పూర్ణాహుతి జరుగుతాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌క ల్యాణ్ సూచనలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొ నాలని ఆమె కోరారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

సామర్లకోట, ఆగస్టు 25: సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం విజయవాడ డివిజన్ సీని యర్ కమ్మర్షియల్ మేనేజరు రాంబాబు తనిఖీలు నిర్వహించారు. రైలులో ఐఆర్‌సీటీసీ ద్వారా అందుతున్న ఆహార సదుపాయాలు, ఎమ్మార్పీధరలకే విక్రయాలు జరుగుతుందీ, లేనిదీ తెలుసుకునేందుకు తదితర అంశాలపై ప్రయాణికులనుంచి ఆరా తీశారు. ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సైతం తెలుసుకుని నమోదు చేసుకున్నారు. మెజార్టీ ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌రైలులో మెరుగైన సేవలందించేందుకు ఈ తనిఖీలు దోహదపడతాయని రాంబాబు చెప్పారు. విజయవాడ నుంచి వందేభారత్ రైలులో సామర్లకోట వరకూ డీసీఎం ప్రయా ణించారు. సామర్లకోటలో దిగి మరో రైలులో విజయవాడ వైపు వెళ్ళే రైలులో తనిఖీల నిమిత్తం సీనియర్ డీసీఎం తరలివెళ్లారు.

కొత్తపేటలో నందమూరి బాలకృష్ణ సందడి

ఒక వివాహ రిసెప్షన్‌కు హాజరు

భారీగా తరలివచ్చిన అభిమానులు

కొత్తపేట, ఆగస్టు 25: ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగమల్లేశ్వరరావు కుమారుడు రిసెప్షన్‌కు కొత్తపేట విచ్చేశారు.ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలులో జరిగిన వేడుక లకు హాజరై కాసేపు సందడి చేశారు. విషయం తెలియడంతో పెద్దఎత్తున అభి మానులు అక్కడికి చేరుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ బాలకృష్ణను కలిశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి శ్రీ వేంక టేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి స్వాగతం పలికారు.స్వాగతం పలికిన వారిలో పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహరావు, బూసి జయలక్ష్మిభాస్కరరావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ శ్రీనివాస్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అంపైర్‌గా శ్రీనివాస్



అమలాపురం టౌన్, ఆగస్టు 25: బ్యాడ్మింటన్ వర ల్డ్ ఫెడరేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని పూణేలో జరగను న్న ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రి క్స్ మెగా టోర్నమెంటుకు అమలాపురం రూరల్ మం డలం కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ అంపైర్ పా యసం శ్రీనివాస్‌ను న్యాయనిర్ణేతగా నియమిస్తూ ఉ త్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు ఈ టోర్నమెంటు జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఇండియా, చైనా, ఇండోనే షియా, కొరియా, మలేషియా, డెన్మార్క్‌తో పాటు వివిధ దేశాల క్రీడాకారులు ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన టోర్నమెంటుకు న్యాయ నిర్ణేతగా రాష్ట్రం నుంచి శ్రీనివాసరావుకు మాత్రమే అవకాశం దక్కింది. ప్ర స్తుతం ఈయన అయినవిల్లి మండలం నల్లచెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశా ల ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ కార్య దర్శి అంకమ్మచౌదరి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒ లింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ విద్యాసంస్థల అధినే త బోనం కనకయ్య, గంధం పల్లంరాజు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్ఎం అక్క ల వెంకట్రావు అభినందించారు.

చంద్రబాబు చేయూతతో అద్దంకికి రీజెన్సీ సిరామిక్స్

● యానాంలో తాత్కాలికంగా మూసివేత ● చేయూత ఇవ్వని పుదుచ్చేరి ప్రభుత్వం

యానాం, ఆగస్టు 25: ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు చేయూతతో యానాం రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమ బాపట్ల జిల్లా అద్దంకికి తరలిపోనున్నది. యానాంలో పరిశ్రమను పునఃప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది. పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి ఏవిధమైనా సహకారం లేకపోవడంతో పరి శ్రమను పునఃప్రారంభించేందుకు యాజమాన్యం ముందుకు రాలేదు. ఎన్నో విధాలుగా కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి తగిన సహకారాం లేకపోవంతో యాజమాన్యం ఆంధ్రాకు వెళ్లడానికి నిర్ణయం తీసుకుంది. ఇటీవల సీఎం చంద్రబాబుతో రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు, ఎండీ డాక్టర్ సత్యేంద్రప్రసాద్ సమావేశమ య్యారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వపరంగా చేయూత ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చా రు. దీంతో బాపట్ల జిల్లా అద్దంకికి రీజెన్సీ పరిశ్రమను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కొన్నిరోజులుగా యానాం పరిశ్ర మలో జరుగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

రీజెన్సీ యాజమాన్యం ముందుకు వస్తే ప్రభుత్వంతో చర్చిస్తా : మల్లాడి

యానాంలో రీజెన్సీ పరిశ్రమ యాజమాన్యం ముందుకు వస్తే వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యానాంలో పరిశ్రమ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. యాజ మాన్యం, కార్మికుల్లో పట్టు విడుపులు లేకపోవడంతో దురదృష్టకరమైన సంఘటన చోటుచేసుకోవడం అనంతరం పరిశ్రమ మూతపడిందన్నారు. అప్పుడే తాను నాయకులతో కలిసి హైదరాబాద్ వెళ్లి రీజెన్సీ సంస్థ చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడును కలిసి యానాంలో పరిశ్రమ తిరిగి ప్రారంభించాలని కోరానన్నారు.

డెంగీ జ్వరంతో 25 ఏళ్ల మహిళ మృతి

ద్రాక్షారామ, ఆగస్టు 25: డెంగీ జ్వరంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన అడపా పా వని(25) ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందింది. ఈ నెల 19న అడపా పావని సోదరుడికి రాఖీ కట్టేందుకు తన పుట్టింటికి సంపర వెళ్లింది. జ్వరంతో రావడంతో స్థానికంగా చికిత్స పొందింది. అనంతరం కాకినా డ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 24న సాయంత్రం వెంటిలేటర్‌పై అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. మృతదే హాన్ని బంధువులకు అప్పగించారు. కాగా పావని భర్త గోపాలకృష్ణ మెడికల్ షాపు నిర్వహిస్తుంటారు. వీరికి నాలుగేళ్ల బాలుడు, మూడేళ్ల బాలిక ఉన్నారు.

గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సేవలు అభినందనీయం

మామిడికుదురు, ఆగస్టు 25: గల్ఫ్ యువనేస్తం సేవాసమితి సేవలు అభినందనీయమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మామిడికుదురు శివారు చేరీతోటకు చెందిన ముషిణి వెంకటేశ్వరరావుకు సేవాసమితి అందించిన రూ.25వేలతో పాటు మంత్రి రూ.5వేలు, ఈశ్వరి రూ.2వేలు మొత్తాన్ని మంత్రి అందించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులతో పాటు టీడీపీ నేతలు ఈలి శ్రీనివాస్, వాసంశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- పలు మండలాల్లో లఖ్‌పతి దీదీ కార్యక్రమం
- డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కుల అందజేత

మహిళలను లక్షాధికారులను చేస్తాం

మలికిపురం, ఆగస్టు 25: వైసీపీ పాలనలో మహిళల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు వారిని విస్మరించారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన లఖ్‌పతి దీదీ సదస్సులో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాలు సీఎం చంద్రబాబునాయుడుకు మానసపుత్రికలన్నారు. రాజోలు నియోజకవర్గంలో ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టి లఖ్‌పతి దీదీ ద్వారా మొదటి విడతలో 1055మంది లక్షాధికారులుగా మారనున్నారన్నారు. 93సంఘాలకు చెందిన రూ.11కోట్ల రుణాల చెక్కులను అందించారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మంగెన భూదేవి, సుందర శ్రీనివాస్, మట్టా శైలజ, ఎం.సత్తిబాబు, కె.పుష్పకుమారి, కె.కనకేశ్వరరావు, లలితశివజ్యోతి, హెలీన, దుర్గాదేవి, మట్టా అనంతలక్ష్మి, గెడ్డం రాజ్యలక్ష్మి, దొండపాటి సుజాత, వెలుగు సిబ్బంది వరాలబాబు, అజయ్, విజయ్, జోగారావు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మలికిపురం, పి.గన్నవరంలలో డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు దేవవరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ

మహిళా ఆర్థిక పురోభివృద్ధికి కృషి

అంబాజీపేట, ఆగస్టు25: ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక డ్వాక్రా సంఘ కార్యాలయంలో మహారాష్ట్రలోని ప్రధాని మోదీ లఖ్‌పతిదీదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానిమోదీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో నాయకులుపాల్గొని వీక్షించారు. డ్వాక్రా సంఘ నుంచి మంజూరైన చెక్కును ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, కోకన్వీనర్ సత్యనారాయణలు మహిళలకు అందించారు. ఐకేపీ ఎంపీఎం జి.గంగాధర్, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి డ్వాక్రా మహిళకు రుణాలిచ్చేందుకు కృషి

పి.గన్నవరం, ఆగస్టు 25: ప్రతి డ్వాక్రా మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా లఖ్‌పతిదీదీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రధాని మోదీ చేపట్టారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లఖ్‌పతిదీదీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి డ్వాక్రా మహిళకు రుణాలు ఇచ్చే విధంగా అధికారులు కృషిచేయాలన్నారు. రూ.1.97కోట్ల రుణాల చెక్కును డ్వాక్రా సభ్యులకు ఎమ్మెల్యే అందించారు.డ్వాక్రా సభ్యులకు ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మండల మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత, ఏపీఎం మురళీకృష్ణ, సీసీలు నక్కా నాగవేణి, విప్పర్తి వెంకటరమణ, యానిమేటర్లుపాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీని సద్వినియోగం చేసుకోండి

మామిడికుదురు, ఆగస్టు 25: లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ప్రతీ మహిళ వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. మామిడికుదురు మహిళా సమాఖ్య కార్యాలయంలో లఖ్‌పతిదీదీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని 11గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలకు సంబంధించి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 30మంది మాత్రమే మహిళలు పాల్గొనడం సమాఖ్య అధికారుల అలసత్వానికి అద్దంపడుతోంది. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన మొత్తాన్ని చెక్కు రూపంలో మహిళలకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, బీజేపీ, జనసేన మండలశాఖ అధ్యక్షులు మెండా ఆదినారాయణ, జాలెం శ్రీనివాసరాజా, ఏపీఎం డి.అజయ్, సీసీ ఆనంద్, సమాఖ్య సెక్రటరీ బి.శాంతికుమారి, నాయకులు కోటిపల్లి సాయిబాబా, పసుపులేటి మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు లఖ్‌పతి దీదీ

అయినవిల్లి, ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలను ఆర్థికంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడానికి లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని ఎంపీడీవో టి.వెంకటాచారి అన్నారు. ఆదివారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తొత్తరమూడి గ్రామసర్పంచ్ వార జయసావిత్రి అధ్యక్షతన లఖ్‌పతి దీదీ కార్యక్రమం నిర్వహించారు. మహారాష్ట్రలోని లఖ్‌పతి దీదీలను సన్మానించే కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్న ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని మహిళా సమాఖ్య కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు వీక్షించారు. అనంతరం మహిళా సంఘాలకు వివిధ వాణిజ్య బ్యాంకుల నుంచి అందించిన రూ.3.71కోట్ల చెక్కును మహిళలకు అందించారు. ఐదుగురు లఖ్‌పతి దీదీలకు, మరో ఐదుగురు సీఆర్పీలకు ప్రశంసా పత్రాలను ఎంపీడీవో అందజేశారు. ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త సీహెచ్ వెంకటేశ్వరరావు, మండలశాఖ అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, సర్పంచ్‌లు మేడిద దుర్గాప్రసాద్, కె.సునీత, జి.రమాదేవి, పి.సుబ్బారావు, కె.శ్రీరామచంద్రమూర్తి, మండల సమాఖ్య కార్యదర్శులు పి.ప్రశాంతి, బి.శాంతి, సీసీ ఎం.దుర్గ, వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

లక్షాధికారిణి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

కె.గంగవరం, ఆగస్టు 25: ప్రతీ డ్వాక్రా మహిళకు స్వయం ఉపాధి కల్పించి లక్షాధికారిణి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి దొరబాబు అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు లఖ్‌పతి దీదీ కార్యక్రమంపై అవగాహన కలిగించారు కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, వెలుగు ఏపీఎం ఏ.రఘురామ్, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ వెంకట్రావు, సీఆర్‌పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళలను బలోపేతం చేసేందుకే

రాయవరం, ఆగస్టు25: మహిళలను ఆర్థికంగాబలోపేతం చేసుందుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన లఖ్‌పతీ దీదీ యోజనపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం నాజర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయవరంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లఖ్‌పతి దీదీ యోజన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, మహిళా సమాఖ్య సభ్యులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యావంతులకు అండగా

అమలాపురంటౌన్, ఆగస్టు25: ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తూ గారపాటి వీర్రాజు మెమోరియల్ ట్రస్టు ఆర్థికసాయం అందజేస్తుందని చైర్మన్ గారపాటి సూర్యనారాయణ తెలిపారు. విజయనగరం ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన బండారులంకకు చెందిన పేద విద్యార్థిని లక్కింశెట్టి వర్షితకు హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.25వేలు అందించారు. భీమవరం విష్ణు ఇంజనీరింగ్‌కళాశాల ఫర్ ఉమెన్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన అవిడి విద్యార్థిని యాళ్ల మోహనశ్రీవెంకటలక్ష్మికి రూ.25వేలు అందించారు. పలువురు విద్యార్థులకు ట్రస్టు తరపున సాయం అందించారు. ట్రస్టు కార్యదర్శి సాధనాల నాగేశ్వరరావు, కోశాధికారి బసవా శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మోహనరావు, గిరి సుప్రజపాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.91లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు25: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,91,233 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమరావతికి చెందిన కేశపాటి శ్రీరామమూర్తి-శేఖసువర్చలదంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆలయ ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

విజయదుర్గా పీఠంలో జిల్లా జడ్జి పూజలు

రాయవరం,ఆగస్టు25: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం రాజమహేంద్రవరం ఫస్ట్ క్లాస్ అడిషనల్ జిల్లా జడ్జి ఆర్.శివకుమార్, పద్మావతి దంపతులు పూజలు నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారికి అర్చనలు, హారతులు నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి దంపతులు ఆధ్వర్యంలో జడ్జి దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, అజ్జరపు హరిబాబు, గాదే కృష్ణ, వడ్డాది పెద్దబాబు, ఏఎస్ఐ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణుల వేషధారణ పోటీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 25: సంస్కారభారతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం గారపాటి వీధిలోని గీతా విద్యాలయ పాఠశాల ఆవరణలో బాలకృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. 150మంది చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రశంసా పత్రాలు, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కారభారతి అధ్యక్షుడు ఆకొండి పవన్, కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, రాష్ట్ర మహిళా ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, వై.అనంతలక్ష్మి, రంగోలి ప్రముఖ్ వాసంశెట్టి శ్రీదేవి, గోకరకొండ బలరామకృష్ణగోవిందం, శ్రీగిరి గోపాలకృష్ణ, ఖులుసు జగదీష్ తదితరులు పాల్గొన్నారు. గొల్లగూడెం ఆదిత్య పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం నిర్వహించారు. వేషధారణల్లో భాగంగా కాళీయమర్దన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కృష్ణుని వేషధారణ చేసిన వారు ఉట్టికొట్టే కార్యక్రమం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



ముమ్మిడివరం: పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.ముమ్మిడివరంలోని భాష్యం, విబ్జియార్ పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

ఆత్రేయపురం: ర్యాలి మ్యాజిక్ హౌస్ వద్ద ఆదివారం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గోపికృష్ణుడు వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు వేషధారణల్లో అలరించారు. అనంతరం కృష్ణుడు వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. విజేతలకు ఫిజియోథెరపిస్ట్ మోహిత్ బహుమతులను అందజేశారు.

మామిడికుదురు: మామిడికుదురు దీప్తి స్కూలులో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో అలరించారు. గోపికలు, కృష్ణుడు వేషధారణలతో ఆకట్టుకున్నారు. బాలలు చిన్నికృష్ణుడు వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల తొలగింపు

- దళితుల ఆందోళన
- మరో చోట ఏర్పాటుకు అంగీకారం
- సద్దుమణిగిన వివాదం


ఆందోళన చేస్తున్న దళితులు

అమలాపురం రూరల్, ఆగస్టు 25: రెడ్డిపల్లి సెంటర్‌లో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఈనెల23న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. 24వతేదీ రాత్రి ఆ విగ్రహాలను అక్కడి నుంచి తొలగించారు.దాంతో ఆదివారం ఉదయం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన దళితులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. తొలగించిన ప్రాంతంలోనే విగ్రహాలు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు, రెవెన్యూ అధికారులు సిబ్బందితో అక్కడకు స్థలానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలతో దశల వారీగా చర్చలు నిర్వహించారు. ముందు ఏర్పాటుచేసిన ప్రాంతంలో కాకుండా సమీపంలో ఎదురుగా ఉన్న గాంధీనగర్‌లో ఏర్పాటు చేసుకునేందుకు అంగీకారం తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగింది. సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, మాజీ సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, దాసరి సాయిబాబు, నిమ్మకాయల రాంబాబు, ఆకుమర్తి రాంబాబు, తవిటిక రాజు, చుట్టుగుళ్ల వెంకట్రావు, మల్లవరపు శ్రీను, మల్లవరపు ఏడుకొండలు, కరాటం దొరబాబు, రేలంగి శ్రీను, కొలిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

హామీల అమలులో ముందడుగు: బండారు

కొత్తపేట, ఆగస్టు 25: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవ్వకుండానే హామీల అమలులో ముందడుగు వేస్తున్నామనిఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈనెల23న వానపల్లిలో జరిగిన స్వర్ణ వానపల్లి గ్రామసభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చిన విషయం తెలిసిందే. ఆ గ్రామసభలో ఆయన ఇచ్చిన హామీలు 24గంటలు గడవకముందే అమలకు నోచుకున్నాయన్నారు. ఇందులో భాగంగా వాడపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి నాగమల్లేశ్వరకిరణ్, వానపల్లి శివారు సంగంపాలేనికి చెందిన ఇళ్ల భగవాన్‌కు రూ.3లక్షలు విలువైన రెండు ఎలక్ట్రికల్ బైక్‌లు అందజేయడం సంతోషకరమన్నారు. వైసీపీ పాలనకు కూటమి పాలనకు మధ్య వైవిధ్యం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లపాలనలో వ్యవస్థలన్నీ నాశనంచేసి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమ శక్తులన్నీ ధారపోస్తున్నారన్నారు. 11సీట్లకు పరిమితమైన వైసీపీ ఇప్పుడు స్థానిక నేత ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రెస్‌మీట్ల పేరుతో గలాట సృష్టిస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సర్పంచ్‌లు పల్లి భీమారావు, త్సామా బాబు, బండారు బుల్లితాత, గనిశెట్టి వీరేష్, బండారు వీరబాబు, పప్పుల బుజ్జి, చిక్కం హనుమంతు, కడియం చిన్న పాల్గొన్నారు.


వానపల్లిలో సీఎం హామీ మేరకు ఇద్దరు యువకులకు ఎలక్ట్రికల్ బైక్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు

గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవలు అభినందనీయం


మామిడికుదురు: కార్మికశాఖ మంత్రి సుభాష్‌కు పీచుతో తయారు చేసిన వేంకటేశ్వరస్వామి బొమ్మను అందిస్తున్న మహిళలు

మలికిపురం, ఆగస్టు 25: గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గుడిమెల్లంకలో గొల్లపల్లి సూర్యారావు సమతా కల్యాణ మండపంలో జరిగిన సన్మాన కార్యక్రమ సభలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ యువకులు ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి తమ కుటుంబాలను, పిల్లలను చక్కబెట్టుకుంటూ తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదల కోసం ఖర్చు చేయడం ప్రశంసనీయమన్నారు. తాను 11ఏళ్లు వైసీపీలో ఉన్నానని, తనకు ఏనాడు గుర్తింపు లేదన్నారు. కోనసీమ అల్లర్లలో ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని తాను స్వరమెత్తి ముందుకు వెళ్లానని, ఆనాడు ప్రాంతాలకు అతీతంగా మీరంతా ఇచ్చిన తోడ్పాటు నన్ను ఈస్థాయికి తీసుకువచ్చిందన్నారు. బతికినంత కాలం మీ అందరికీ రుణపడి ఉంటానని ఆయన అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తారని, అదేవిధంగా కల్లుగీత కార్మికులకు 20శాతం లిక్కరు లైసెన్సులు ఇస్తారని ఆయన చెప్పారు. ఈసందర్భంగా గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థల సభ్యుల తల్లిదండ్రులను దుశ్శాలువాతో సన్మానించారు. సంఘ సభ్యులు మంత్రిని సన్మానించారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా భాస్కర్, గుబ్బల శ్రీనివాస్, పితాని రాంబాబు, చెల్లింగి జగన్ పాల్గొన్నారు.

పీచు బొమ్మల మార్కెటింగ్‌కు సహకారం

మామిడికుదురు, ఆగస్టు 25: కొబ్బరి పీచుతో తయారుచేసిన బొమ్మలకు మార్కెటింగ్ పెరగడానికి సహాయ సహకారాలు అందిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పాశర్లపూడి గ్రామంలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి పీచుతో తయారుచేసే బొమ్మలను విక్రయిస్తున్న గ్రామ దుకాణాన్ని ఆయన సందర్శించారు. ఈబొమ్మలు తయారుచేసిన మహిళలను అభినందించి వీటి ద్వారా మహిళలు ఆర్థికంగా ముందడుగు వేస్తారన్నారు. అనంతరం పీచుతో తయారుచేసిన బొమ్మలను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పీచుతో తయారుచేసిన వెంకటేశ్వరస్వామి బొమ్మలను మహిళలు మంత్రికి కానుకగా అందించారు. కార్యక్రమంలో ఆక్సిజన్ అసోసియేషన్ కటికిరెడ్డి గంగాధరం, దొంగ శ్రీను, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఒంటెలపై హమారీల ఊరేగింపు

మామిడికుదురు, ఆగస్టు 25: కర్బలా పుణ్యభూమిలో అశువులు బాసిన ఇమామ్ హుస్సేన్ అతని 72మంది పరివారానికి నివాళులర్పించేకార్యక్రమంలో భాగంగా నిర్వహించే అర్బెన్ కార్యక్రమాలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక హజరత్అబ్బాస్ పంజా నుంచి అర్బెన్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు మహ్మద్ ఇబ్రహీం మజ్లిస్ ఆలపించారు. నగరంలోని బీబీ సకీనా పంజాలో, మామిడికుదురులోని ఇమామ్ రజాపంజాలో మజ్లిస్‌లు జరిగాయి. ఇమామ్ రజా పంజా నుంచి హమారీలను తీసి ఒంటెలపై మంజిలే కర్బలా వరకు ఊరేగించారు. మర్షియా ఆలపిస్తూ కర్బలా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. గుర్బే తాజ్‌దారే పురాత్ భక్తబృందం ఆధ్వర్యంలోకార్యక్రమాలు జరిగాయి. ఇమామ్ హుస్సేన్ పంజాలో మజ్లిస్ జరిపి గుమ్మటాన్నితీసి మాతం చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

మంత్రి సుభాష్‌ను కలిసిన సత్యస్కాన్ అధినేత కాదా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 25: మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం సత్యస్కాన్ అధినేత, టీడీపీ నాయకుడు డాక్టర్ కాదా వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. సామాజిక, రాజకీయాలపై చర్చించారు.

సంక్రాంతి పండుగలా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు


పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

అమలాపురంటౌన్, ఆగస్టు25: ఇప్పటివరకు పవర్‌స్టార్ రేంజ్‌లో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగిందని, ఈఏడాది నుంచి పవర్‌లో ఉన్న డిప్యూటీ సీఎం హోదాలో సంక్రాంతి పండుగను తలపించేలా జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్టు జనసేన నాయకులు ప్రకటించారు. జనసేన ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు ఆధ్వర్యంలో అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈనెల31న మొక్కల పంపిణీ కార్యక్రమం, సెప్టెంబరు1న ఎర్రవంతెన వద్ద వెంకటరమణ ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. సెప్టెంబరు 2న జనసేనాని పుట్టినరోజును పురస్కరించుకుని అన్ని మండల కేంద్రాల్లో డొక్కా సీతమ్మపేరిట అన్నదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు.ఆయా కార్యక్రమ వివరాలతో ముద్రించిన బ్రోచర్లను విడుదలచేశారు. జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్, మున్సిపల్ కౌన్సిలర్లు పిండి అమరావతి, గండి దేవిహారిక, నాయకులు పిండి రాజా, గండి స్వామి, సత్తి సూరిబాబు, చిట్నీడి శ్రీదేవి, ఆకుల బుజ్జి, నల్లా రాము, ఆకేటి సత్తిబాబు, క్రైరం సత్య పాల్గొన్నారు.

కూటమి విజయానికి కృషిచేసిన నాయకులకు సత్కారం

పి.గన్నవరం, ఆగస్టు 25: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి టీడీపీ యాప్‌లో సభ్యులుగా ఉన్న కార్యకర్తలు విశేష కృషిచేశారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. స్థానిక కూటమి కార్యాలయంలో పది మంది యాక్టివ్ కార్యకర్తలను సత్కరించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, మట్టపర్తి రామకృష్ణ, చిట్టూరి శ్రీనివాస్, గుత్తుల రామకృష్ణ, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరరావు, పబ్బినీడి రాంబాబు, పెచెట్టి ఈశ్వర్, నక్కా సునీల్, లంకే భీమరాజు, బొరుసు సుబ్బరాజు, పెచ్చెట్టి వెర్రియ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్యులస్

అంతర్వేది ఆలయంలో ఎస్పీ పూజలు



అంతర్వేది, ఆగస్టు 25: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి ఎస్పీ బి.కృష్ణారావు దంపతులు ఆదివారం విచ్చేశారు. తొలుత వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేదపండితులు వారికి మహదాశీర్వచనం చేయగా, ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాసరావు, పోలీసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను నిర్లక్ష్యంగా పడవేయలేదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మండపేట, ఆగస్టు 25: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఒక గదిలో కుప్పలుగా పారేసివున్న రికార్డులపై నిర్లక్ష్యంగా అనే శీర్షికతో ఈనెల20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు తహశీల్దార్ తేజేశ్వరరావు వివరణ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం లో రికార్డులు భద్రపరిచే గది ఖాళీలేక పోవడంతో కార్యాలయం పైభాగంలో వీసీ నిర్వహించే హాల్‌లో ఒక పక్కన కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాల ఫైళ్లను ఉంచామన్నారు. ఈహాల్‌ముందు భాగంలో సీసీ కెమెరా కూడా ఏర్పాటుచేశా మన్నారు. రికార్డులను నిర్లక్ష్యంగా పడవేయలేదని, వాటిని భద్రపరిచామని వివ రణఇచ్చారు. ఉన్నతాధికారుల అనుమతితో రికార్డులనుధ్వంసం చేస్తామని తహశీల్దార్ తెలిపారు.


రైతుల సంక్షేమానికి కృషి

యానాం, ఆగస్టు25: యానాం నియోజకవర్గంలో రైతుల సం క్షేమానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం శివారు దరియాలతిప్ప రైతు సంఘ సభ్యులు మల్లాడి స్వగృహంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రైతులతో మల్లాడి మాట్లాడారు. ఇటీవల సంఘసభ్యుల్లో వచ్చిన విభేదాల కారణంగా సంఘాన్ని రెండుగా ఏర్పాటుచేయడం సరైందికాదని, అందరూ ఒకే తాటిపైఉంటేనే సంఘం మరింత బలంగా ఉంటుందన్నారు.దరియాతిప్ప రైతులకు చమురు సంస్థల నుంచి రావాల్సిన పరిహారంతో పాటు అభివృద్ధి పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. సంఘ సభ్యులు మల్లాడిని సత్కరించారు.

28న ఉట్లోత్సవం

ఆత్రేయపురం, ఆగస్టు 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు వైష్ణవ సంప్రదాయ ప్రకా రం నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్వామి వారి సన్నిధిలో ఉన్న వేణుగోపాలస్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అర్చన, స్వామివారికి ద్వాదశ నివేదనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30గంటలకు ఉట్లోత్సవం, స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా ఈనెల 30న ఆఖరి శుక్రవారం సందర్భంగా ఉదయం 10గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

నాణేలపై శ్రీకృష్ణుడు.. లక్ష్మీదేవి



అమలాపురం టౌన్, ఆగస్టు 25: యూరోపియన్ దేశం ఆస్ట్రియా విడుదల చేసిన వంద యూరోల బంగారు నాణేలపై ఓ వైపున శ్రీకృష్ణ పరమాత్మ, మరోవైపున లక్ష్మీదేవి ముఖ చిత్రాలు ఉన్నాయి. నాణేనికి ఒకవైపున కృష్ణ పరమాత్మ నెమలి పింఛాలతో లలితాసనంలో కూర్చొని బంగారు ఆభరణాలను ధరించినట్టు, రెండో వైపున లక్ష్మీదేవి రెండు చేతుల్లో తామరపువ్వులు, మరో రెండు చేతుల నుంచి బంగారు నాణేలు పడుతున్నట్టుగా ముద్రించారు. ఈనాణేలను అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణకామేశ్వర్ స్కాట్లాండ్‌లో ఉన్న మిత్రుడు నండిపల్లి కిశోర్‌కుమార్‌రాజు సహకారంతో సేకరించారు.

బీజేపీని బలోపేతం చేయండి

ముమ్మిడివరం, ఆగస్టు 25: బీజేపీని మరింతగా బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలో ఆదివారం పీవీవీ సత్యనారాయణమూర్తిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయ్యాజీవేమా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వాల నమోదును విజయవంతం చేయాలన్నారు. మండలంలో ప్రతీ బూత్ నుంచి కనీసం 200మందిని సభ్యులుగా నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గనిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రంధి నానాజీ, గొలకోటి వెంకటరెడ్డి, కొడవర్తి వెంకటరత్నశర్మ, పీవీవీ సత్యనారాయణరాజు, పి.రామకృష్ణరాజు, పీవీవీఎస్ఎన్ రాజు, జీవీ రమణమూర్తి, గిరి వెంకటప్రసాద్, పాము పురుషోత్తం, నిట్టల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

రాయవరం, ఆగస్టు 15: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం లొల్లలో జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలనుంచి విశేష స్పందన వస్తుందన్నారు. నాయకులు శాకా దుర్గాశ్రీనివాస్, కేవీవీసాయిరాం, చాట్రాతి జానకి రాంబాబు, నరాల రాంబాబు, అబ్బిరెడ్డి శాంతారావు, ముప్పాడి కృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

1నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

కె.గంగవరం, ఆగస్టు25: సెప్టెంబరు1నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అవసరాల రమణమూర్తి అన్నారు. ఆదివారం అముజూరులో పార్టీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలోని 64బూత్‌ల్లో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయాలన్నారు. పార్టీ నాయకులు సలాది రామకృష్ణ, నున్న సత్యనారాయణ, పోలిశెట్టి త్రిమూర్తులు, టి.ముసలయ్య, కె.చందు, పసుమర్తి శ్రీరామ్, కవులూరి వెంకటకృష్ణ, ఏ. నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పి.గన్నవరం,ఆగస్టు25: మానేపల్లిబాలుర ఉన్నతపాఠశాలలో 2023-24లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 1989-90బ్యాచ్‌పూర్వ విద్యార్థుల ప్రోత్సాహకాలు అందించారు. జాలెం భార్గవ్, కందాల నిఖిల్, చిమ్మిలి గీత, వై.భాగ్యలత, ఏడిద వంశీ, లంక శిరీషలకు రూ.3వేలు చొప్పున అందించారు.

హత్యాచారాలకు పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలి

అమలాపురంటౌన్, ఆగస్టు25: కోల్‌కతా ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యవిద్యార్థిని హత్యాచారాన్ని ఖండిస్తూ కొల్లు గౌతమ్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. విద్యార్థులతో పాటు స్థానిక సీఎమ్మార్ షాపింగ్ మాల్ సిబ్బంది, వివిధవర్గాల ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ హత్యాచారాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తేరంగౌతమ్‌రాజుపాల్గొన్నారు.

సేవాపత్రం గ్రహీత సుబ్రహ్మణ్యానికి సత్కారం

అంబాజీపేట, ఆగస్టు25: స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి సేవా పురస్కారం, డీజీపీ కమాండేషన్ డిస్క్, ఆంత్రిక్ సురక్ష సేవా పత్రాన్ని అందుకున్న మట్టపర్తి సుబ్రహ్మణ్యంను స్థానికులు సత్కరించారు. అంబాజీపేటకు చెందిన మట్టపర్తి సుబ్రహ్మణ్యం 2013నుంచివైజాగ్ గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్నాడు. స్థానిక జీఎస్‌ఆర్‌అవుట్‌లో సుబ్రహ్మణ్యంనుఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జనసేనపార్టీ నాయకుడు కొర్లపాటి గోపి ఆధ్వ ర్యంలో సత్కరించారు. దొమ్మేటి సత్యమోహన్, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌ను సన్మానించిన ఎంపీపీ కేతా



రాజోలు,ఆగస్టు25: తాటిపాకలో ఎంపీపీ కేతా శ్రీను నూతన గృహాన్ని నిర్మించుకు న్నారు. ఆదివారం ఆ గృహానికి విచ్చేసిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఎంపీపీ కేతా శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు ఆదివారం దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చెల్లుబోయిన రామచంద్రరావు, చిట్టూరి సంతోష్, గుబ్బల విక్రమ్, బొక్కా పృథ్వి, కోళ్ల నాగరాజు, గుబ్బల భూషణం, బైరిశెట్టి మధు, మోహనరావు, కట్టా రాముడు, చెల్లుబోయిన పెద్దిరాజు, గుబ్బల పుల్లయ్యశెట్టి, కట్టా నాగరాజు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

కపిలేశ్వరపురం, ఆగస్టు 25: వృద్ధురాలి అదృశ్యంపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. కపిలేశ్వరపురానికి చెందిన అంసూరి సత్యవతి(66) ఈనెల16నుంచి కనిపించడం లేదని ఆమె మనువడు శ్రీనివాస్ ఈనెల18న అంగర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందాలు శిబిరంపై దాడి

కపిలేశ్వరపురం,ఆగస్టు25: అద్దంకివారిలంకలో కోడిపందాలు శిబిరంపై అంగర పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. రెండు పందెంకోళ్లు, రెండుమోటర్‌సైకిళ్లు, రూ.8,020 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ గంగరాజు మృతి



కొత్తపేట, ఆగస్టు 25: కొత్తపేట మండలం గొలకోటివారిపాలెంలో వినాయకుడి గుడికి రంగులు వేస్తున్న పల్లపు గంగరాజు(34) ప్రమాదవశాత్తు 11కేవీవిద్యుత్‌వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ముమ్మిడివరం మండలం రాణేలంక గ్రామానికి చెందిన పల్లపు గంగరాజు మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో వినాయకుడిగుడికి రంగులు వేస్తున్నా డు. శిఖరానికి పెయింటింగ్ వేస్తున్న తరుణంలో అనుకోకుండా 11కేవీ విద్యుత్‌లైన్ వైరు భుజానికి తగలడంతో షాక్‌కు గురై కింద పడిపోయి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

గంగరాజు మృతితో విషాదం

ముమ్మిడివరం, ఆగస్టు25: రాణేలంక పంచాయతీ పరిధిలోని రజకపేటకు చెందిన పల్లపు గంగరాజు(35)మృతితో కుటుంబంలో, గ్రామంలో విషాదం నెలకొంది. అతడికి భార్య లక్ష్మి, కుమారుడు వీరనాగకార్తికేయ, కుమార్తె ధరణి మహిత ఉన్నారు. గంగరాజు మృతితో తల్లిదండ్రులు నాగేశ్వరరావు-రావులమ్మ, భార్య లక్ష్మి రోదిస్తున్నారు. తల్లిదండ్రులు, భార్యా పిల్లలకు గంగరాజే ఆధారం. అందరితో కలివిడిగా ఉండే గంగరాజు మృతి విషయాన్ని కాలనీ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు దిక్కెవరని కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.20వేలు విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు25: ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానపథకానికి వరంగల్‌కు చెందిన వెంకటరమణ-సునీత దంపతులు కుమారులు నిఖిల్, నితిన్ పేరున రూ.20వేలు విరాళం సమర్పించారు.

విద్యార్థికి నామన ఫౌండేషన్ సాయం

మామిడికుదురు,ఆగస్టు25: ఇంటర్ చదువుతున్న గంటా శ్యామప్రసన్నకు ఫీజు కోసం నామన ఫౌండేషన్ ద్వారా రూ.65వేలు చెక్కును ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు ఆధ్వర్యంలో డాక్టర్ నామన వినోద్ అందించారు. అడబాల సాయిబాబు, నామన రమేష్, తిరుమల సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.